- కొలిక్కిరాని ఆరోగ్య సబ్‌సెంటర్ల నిర్మాణం
- వనపర్తి జిల్లాకు 62 భవనాలు మంజూరు
- కేసీఆర్ ప్రభుత్వంలో ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరు
- రెండేండ్లుగా నత్తనడకన కొనసాగుతున్న పనులు
- ఎంబీలు రికార్డయి ఏడాదైనా నో బిల్స్


రేవల్లి మండలం తల్పునూరులో అసంపూర్తిగా నిలిచిన ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణ పనులు

# ఆరోగ్య సబ్‌సెంటర్లకు అనారోగ్యం!

వనపర్తి, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, ఇందుకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యం రెండేళ్లుగా జిల్లాలో నీరుగారుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 62 ఆరోగ్య సబ్‌సెంటర్ల భవనాలను కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను 2022లో పూర్తి చేసి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే, ఇవేవీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో ఈ సబ్‌సెంటర్లకు కేటాయించిన డాక్టర్లు, ఏఎన్‌ఎంలు డిప్యూటేషన్లపై విధు లు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలందించాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రక్రియ ఆశించిన స్థాయిలో అమలుకావడం లేదు. వనపర్తి జిల్లా లో మొత్తం 98 ఆరోగ్య సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి భవనాలున్నాయి. అయితే, 62 సబ్ సెంటర్లకు పక్కా భవనాలను నిర్మించడం కోసం నిధులు మంజూరయ్యాయి. వీటికి టెండర్లను నిర్వహించి పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)ద్వారా 38 సబ్ సెంటర్లు, 15వ ఆర్థిక సంఘం నిధులతో మరో 24 భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

**కేవలం 13 భవనాలు పూర్తి**

జిల్లాలో చేపట్టిన 62 ప్రాథమిక సబ్‌సెంటర్ల భవనాలకు సంబంధించి ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) నిధుల ద్వారా కేవలం 13 మాత్రమే పూర్తయ్యాయి. ఇక మిగిలిన వాటిలో మరో నాలుగింటి పనులు మొదలు కాలేదు.. ఇంకా ఎనిమిది ఫౌండేషన్ స్థాయిలో ఉండగా, పునిది లెవెల్‌లో రెండు, లెంటల్ లెవల్‌లో ఒకటి, రూఫ్ లెవల్ రెండు, మరో ఏడు భవనాలు పైకప్పు పూర్తయ్యాయి. అలాగే 15వ ఫైనాన్స్ నిధుల నుంచి 24 భవనాలు మంజూరైతే, వీటిలో 3 సెంటర్లు పూర్తయ్యాయి. మరో నాలు గు ఫౌండేషన్ స్థాయిలో ఉంటే, మూడు స్లాబ్ లెవెల్‌లో ఉండగా.. మరో 14 భవనాలకు పలు దఫాలు టెండర్లు నిర్వహించినా.. కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు. అక్టోబర్, నవంబర్‌లో 8 భవనాలకు టెండర్లు దాఖలు చేయగా, అగ్రిమెంట్ స్థాయిలోనే మిగిలిపోయాయి. ఇదిలా ఉంటే, వీటిలో 8 గ్రామాల్లో స్థలాల సమస్య కూడా ఉందని అధికారులు గుర్తించారు. ఇప్పటికీ అది కొలి క్కి రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. జిల్లాలోని కేతేపల్లి, బొల్లారం, కొప్పునూ రు, పెద్దదగడ, వెలుగొండ, చెల్లెపాడ్ గ్రామాల్లోని ఆరోగ్య భవనాలకు ఏడు దఫాలుగా టెండర్లు నిర్వహించినా.. ఒక్క కాంట్రాక్టరు కూడా టెండరు దాఖ లు చేయడం లేదు.

**రికార్డులైనా.. బిల్స్ లేవు**

రెండేళ్ల నుంచి పల్లె దవాఖానల భవనాల ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణాల కోసం అవస్థలు పడుతున్నారు. పూర్తి చేసినా ఒక్కరూపాయి కూడా బిల్లు చేతికి రాకపోవడంతో పనులను నిలిపివేశారు. దాదాపు ఏడాది కిందట రికార్డు అయినా వాటికి కూడా నిధులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. 13 భవనాలు పూర్తయినవి ఉంటే, మిగిలినవి వివిధ స్థాయిలో ఉండగా, బిల్స్ మాత్రం లేకపోవడంతో నిర్మాణాలన్నీ చతికిలపడ్డాయి. నిర్మాణాలు పూర్తి చేసిన వాటికి బిల్స్ ఇస్తే తప్పా.. మిగిలిన వాటిని ఎట్టి పరిస్థితిలో చేపట్టలేమని కాంట్రాక్టర్లు మొండికేశారు.

**ఎన్‌హెచ్‌ఎం నిధులు నిల్..**

నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మంజూరైన 38 భవనాలకు నిధులు నిల్ అన్నట్లుగానే పరిస్థితి తయారైంది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగే ఈ ఎన్‌హెచ్‌ఎం ద్వారా మంజూరైన ఈ భవనాల పనులను పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిర్వహిస్తున్నారు. ముందుగా ఈ భవనాలు మంజూరైతే, వీటి కే టెండర్లు పెట్టి పనులు చేయించారు. కానీ, ఈ పథకంలో ప్రస్తుతం నిధులు లేనందున పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరైన కొన్ని భవనాలకు రూ.80 లక్షలు పేమెంట్ జరిగింది. ముందు కట్టిన ఎన్‌హెచ్‌ఎం భవనాలకు నిధులు ఇవ్వకుండా రెండో దఫాలో వచ్చిన భవనాలను నిర్మించడానికి కాంట్రాక్టర్లు సుముఖత చూప డం లేదు. ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయాం.. మళ్లీ కొత్త పనులు పెట్టుకుని ఇంకా ఆర్థిక ఇబ్బందులు కొనితెచ్చుకోలేమన్న అభిప్రాయంలో కాంట్రాక్టర్ల ధోరణి వినిపిస్తున్నది.

**నెరవేరని ఆశయం**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్యం అందించాలన్న ఆశయం మారుమూల గ్రామాల్లో నెరవేరడం లేదు. ఈ కేంద్రాలోల ఒక డాక్టరు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్ల విధులు నిర్వర్తించాల్సి ఉన్నది. శాశ్వత భవనాల నిర్మాణాలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో కేవలం బోర్డులు తగిలించి ఉన్నా డాక్టర్లు, ఏఎన్‌ఎంలు వాటి వైపు చూసే పరిస్థితి కనిపించడం లేదు. ఆశ వర్కర్లు మాత్రమే దర్శనం ఇచ్చే పరిస్థితి ఉన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలాచోట్ల గ్రామాలకు కేటాయించిన ఉద్యోగులు వారికి అనుకూలంగా ఉండే పట్టణ ప్రాంతాలను ఎంచుకొని అక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

**ఎమ్మెల్యే ప్రారంభించినా..**

ఈనెల 4న రేవల్లి మండలం నాగపూర్‌లో ప్రాథమిక సబ్ సెంటర్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. భవనం ఓపెనింగ్ జరిగి 15 రోజులు గడుస్తున్నా.. అటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ప్రారంభోత్సవం జరిగిందన్న సంతోషమే కానీ, వైద్యసేవలు మాత్రం అందడం లేదన్న అసంతృప్తి స్థానికుల్లో వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం పురాతన భవనంలోనే సబ్‌సెంటర్ నిర్వహిస్తున్నారు. కేవలం ఒక ఏఎన్‌ఎంతోనే వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ఇక్కడికి డాక్టర్ వచ్చినా కొద్ది రోజులు మాత్రమే ఉండి వెళ్లి పోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలి.

### పూర్తి చేయిస్తాం..



వనపర్తి జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల పనులను వేగవంతం చేస్తాం. 13 భవనాలు పూర్తి కాగా, మిగిలినవి ఆ యా స్థాయిలో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్నవాటిపై ప్రత్యేక దృష్టిపెడతాం. కొన్ని బిల్స్ పెండింగ్ ఉండడంతో పనులు నెమ్మదిగా నడుస్తున్నాయి. వీలైనంత పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయిస్తాం.

– మల్లయ్య, ఈఈ, పీఆర్, వనపర్తి

### చాలా ఇబ్బందులు..



గ్రామాల్లో సబ్‌సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో చాలా ఇబ్బందులున్నాయి. చాలా భవనాలు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల ఉన్నా ప్రాథమిక సౌకర్యాలు లేవు. నూతన భవనాలు నిర్మిస్తే గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.80 కోట్లు రాగా.. రూ.80 లక్షలు చెల్లింపులు జరిగాయి. మిగిలిన పనులకు రూ.4 కోట్ల నిధులు రెడీగా ఉన్నాయి. ఎన్‌హెచ్‌ఎం ద్వారా రావాల్సిన నిధులు రాలేవు. నిర్మాణాలు జరిగిన భవనాల రిపోర్టును రాష్ట్ర అధికారులకు పం పించే ప్రయత్నం చేస్తున్నాం.

– శ్రీనివాసులు, జిల్లా వైద్యాధికారి, వనపర్తి

## కిడ్నాప్ కేసులో ఊహించని ట్విస్ట్



- కర్ణాటకలోని యాపల్‌దిన్నె శివారులోని బావిలో బాలుడితోపాటు మరో మృతదేహం లభ్యం

గద్వాల అర్బన్, డిసెంబర్ 20 : ఓ బాలుడు గురువారం అదృశ్యమై శవంగా తేలిన ఘటన శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్ జిల్లా యాపల్‌దిన్నె గ్రామ శివారు ప్రాంతంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన పవన్(8) గురువారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. సాయంత్రం 7 గంటలైనా ఇంటికి రాకపోవడంతో తండ్రి నర్సింహులు స్థానిక పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి బాలుడిని బైక్ మీద ఎక్కించుకొని పోయినట్లు స్థానికులు తండ్రికి తెలపడంతో గురువారం రాత్రి బాలుడి తండ్రి నర్సింహులు కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అయితే శుక్రవారం ఉదయం కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్ జిల్లా యాపల్ దిన్నె గ్రామ శివారు ప్రాంతంలోని సోలార్ ఫ్యాక్టరీ సమీపంలో ఓ బావిలో ఇద్దరి శవాలు కన్పించడంతో స్థానికులు గమనించి యాపల్‌దిన్నె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రక్షణ చర్యలు చేపట్టి బావిలో నుంచి రెండు మృతదేహాలను బయటకు తీశారు. బాలుడి కడుపుకు తాడుతో రాయిని కట్టి బావిలో పడేసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. మరో యువకుడు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కొరగా బాలుడి అదృశంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు ఇంకా తెలియదని త్వరలో వెల్లడిస్తామన్నారు.

## మొక్కలపాలైన ఉపాధిహామీ మస్టర్లు

అమరచింత, డిసెంబర్ 20 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నది. అయితే పనులు జరిగే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేటీల ద్వారా పనిచేసిన ప్రదేశంలో మస్టర్లలో కూలీల వివరాలు సమోదు చేసుకొని పోస్టాఫీస్ లేదా బ్యాంకుల ద్వారా డబ్బులు చెల్లిస్తారు. అయితే అమరచింత ఈజీఎస్ అధికారులు మాత్రం ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలకు సంబంధించిన మస్టర్లను మాత్రం కార్యాలయంలో జాగ్రత్తగా భద్రపరచటంలో నిర్లక్ష్యం వహిస్తూ ఆరుబయట ఉన్న పూలమొక్కల మధ్యన పడవేశారు.


అమరచింత ఈజీఎస్ కార్యాలయంలో మొక్కల మధ్య పడేసిన మస్టర్లు

కేసీఆర్ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం.. ఆధునిక సౌకర్యాలు, హంగులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయాలను నిర్మించింది. కానీ జోగుళాంబ గద్వాల కలెక్టరేట్‌లో కొనసాగుతున్న సివిల్ సప్లయి ఆఫీస్‌లో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూర్చొనేందుకు వీలుగా కుర్చీలు కూడా లేవు. శుక్రవారం కార్యాలయం గడప వద్ద బయట నేలపై కూర్చొని ఒకరు దరఖాస్తు ఫాం పూరిస్తుండగా 'నమస్తే' క్లిక్ మనిపించింది. కార్యాలయంలో మాత్రం సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా ఉన్నా వచ్చిన వారికి కనీస మర్యాదగా కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంపై పలువురు ఆగ్రహం చెందారు.

– ఫొటోగ్రాఫర్, జోగుళాంబ గద్వాల


మంచిర్యాల జిల్లా మందమర్రిలో పోలీసులు అదుపులో ఉన్న ఆటో డ్రైవర్లు

## ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ముందస్తు అరెస్టులు
- హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో అడ్డగింతలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆటోడ్రైవర్ల హెచ్చరికలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉపాధి కోల్పోయామని, హామీ మేరకు ఆర్థిక సాయం చేయాలనే డిమాండ్‌తో ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఆటోడ్రైవర్లు హైదరాబాద్‌కు తరలివచ్చారు. హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా బయల్దేరేందుకు సిద్ధమైన ఆటోడ్రైవర్లను కాస్త ముందుకు వచ్చిన తర్వాత పెట్రోల్‌బంక్ కూడలిలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఆటోడ్రైవర్లను నిర్బంధించి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఆటో జేఏసీ నాయకులను ముందుస్తుగానే అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు మారయ్య, వెంకటేశ్, సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత బస్సు స్కీమ్ తీసుకొచ్చి ఆటోడ్రైవర్లకు ఉపాధి లేకుండా చేశారని, ఆటోడ్రైవర్లను ఆదుకుంటామన్న ప్రభుత్వం దారుణంగా మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్చలకు పిలుస్తామని మాటిచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తమ ఉద్యమం ఆగదని.. ప్రభుత్వం హామీలన్ని నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

### ఆటోడ్రైవర్లకు ఇంత విషం ఇవ్వండి

**ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్**

కోల్‌సిటీ, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తమ చేతులతో తమ చెంపలను కొట్టుకుంటున్నామని ఆటోడ్రైవర్ల యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గోదావరిఖనిలో విలేకరులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల ఉసురు పోసుకోవడం కంటే ఈ ప్రభుత్వ పెద్దలే తమకు ఇంత విషం ఇవ్వాలని చెప్పారు. వెంటనే ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు.

### ఆటో కార్మికుల అరెస్ట్

నమస్తే నెట్‌వర్క్ డిసెంబర్ 20: సమస్యల పరిష్కారం కోసం చలో అస్సెంబీకి బయలుదేరి ఆటో యజమానులు, డ్రైవర్లను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో కార్మికులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.



### కేటీఆర్‌ను కలిసిన ఆటోవాలాలు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 20 : హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆటోవాలాలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి తమ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుతున్నందుకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 100 మందికిపైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇకపై ఎవరూ అలాంటి పనులు చేయొద్దని భరోసానిచ్చారు. మీ సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ హామీ ఇచ్చారు.


SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబయ్
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ సేల్స్) రిక్రూట్‌మెంట్**

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

ఖాళీల సంఖ్య :
సాధారణ : 13735 + బాక్ లాగ్ : 456

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ https://bank.sbi/web/careers/current-openings ప్రకటన నం. CRPD/CR/2024-25/24 లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 17.12.2024 నుండి 07.01.2025 వరకు.

ఏపైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – "CONTACT US"—> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ https://bank.sbi/web/careers/current-openings లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 17.12.2024
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)



